ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.3। కనిష్ఠం 14.7
నిర్మల్
జిల్లా వార్తలు
8
సోమవారం 6 జనవరి 2025



రైతు భరోసా పూర్తిస్థాయిలో ఇవ్వాలి

నిర్మల్‌రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్వేదలో నిర్వహించిన రైతు సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దొంగహామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేయడం జరుగుతుందన్నారు. రైతుభరోసా పూర్తిస్థాయిలో చెల్లించాలని, 12వేలు ఇస్తానని సీఎం ప్రకటించడం రైతులను దగా చేయడమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తోకల అనిల్, శంకర్, నారాయణ, భూమయ్య పాల్గొన్నారు.


పోటీలో పాల్గొని ముగ్గులు వేస్తున్న యువతులు


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న గొల్లపల్లి మాధవి


ప్రథమ బహుమతి అందుకుంటున్న అశ్విని

సప్తవర్ణ శోభితం

- నిర్మల్‌లో ఆకట్టుకున్న 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- భారీగా తరలివచ్చిన మహిళలు
- రంగులమయమైన హరిహరక్షేత్ర ప్రాంగణం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న అయ్యప్ప ఆలయ ధర్మకర్త అల్లోల వినోదమ్మ మురళీధర్‌రెడ్డి
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


ద్వితీయ బహుమతి అందుకుంటున్న ప్రశాంతి


తృతీయ బహుమతి అందుకుంటున్న నవ్య వినయ్


సాంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు




ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు



మొదటి మూడు వరుస బహుమతులను సాధించిన ముగ్గులు

నిర్మల్, జనవరి5 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ము త్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సి యా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' వారి ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఏటా ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన పోటీలకు నిర్మల్ పట్టణంలోని మల్లన్న గుట్టలో వెలసిన హరిహర క్షేత్రం ప్రాంగణం వేదికైంది. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ము త్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సి యా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' వారి ముత్యాల ముగ్గుల పోటీలు.. రాష్ట్రస్థాయి స్పాన్సర్లుగా వ్యవహరించగా నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ వైష్ణవి కన్‌స్ట్రక్షన్ అధినేత, అయ్యప్ప ఆలయ ధర్మకర్త అల్లోల వినోదమ్మ మురళీధర్ రెడ్డిలు లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించారు. ఆదివారం జరిగిన పోటీలకు జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుంచి మహిళలు, యువతులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి ఒక్కొక్కరుగా రాగా వచ్చిన వారి పేర్లను నమోదు చేసుకున్న తర్వాత ఉదయం 11 గంటలకు ముగ్గుల పోట ప్రారంభమైంది. 133 మందికి పైగా మహిళలు, యువతులు, బాలికలు పాల్గొని అందమైన రంగవల్లులు వేశారు. తెలుగు సాంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించడంతోపాటు సామాజిక అంశాలపై చైతన్యం కలిగించేలా మహిళలు వేసి ముగ్గులు అలరించాయి. వృక్ష, నీటి సంరక్షణ, బాలికా సంరక్షణ, రైతు సంక్షేమానికి సంబంధించి చిత్రాలతో వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను అయ్యప్ప ఆలయ ధర్మకర్త అల్లోల వినోదమ్మ మురళీధర్ రెడ్డి దంపతులు తిలకించారు. రెండు గంటల పాటు సాగిన పోటీలు మధ్యాహ్నం 1 గంటలకు ముగిశాయి. న్యాయ నిర్ణేతలుగా గొల్లపల్లి మాధవి, ఎట్టెం రజిత వ్యవహరించారు. ప్రథమ బహుమతి సారంగాపూర్ మండలం తండ్రా గ్రామానికి చెందిన పాలెపు అశ్విని గెలుచుకోగా, ద్వితీయ బహుమతి లక్ష్మణచందా మండలం పొట్టపల్లి గ్రామానికి చెందిన అడిచెర్ల ప్రశాంతి పొందారు. తృతీయ బహుమతిని నిర్మల్ పట్టణానికి చెందిన సంగినేని నవ్య వినయ్ గెలుచుకున్నారు. ప్రథమ బహుమతి రూ.6,000, ద్వితీయ బహుమతి రూ. 4,000, తృతీయ బహుమతి రూ. 3,000 చొప్పున విజేతలకు అందించారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి కన్‌స్ట్రక్షన్స్ అధినేత, అయ్యప్ప ఆలయ ధర్మకర్త అల్లోల వినోదమ్మ మురళీధర్ రెడ్డి, ఆంధ్రజ్యోతి నిర్మల్ సాఫ్ట్ రిపోర్టర్ కొండూరి రవీందర్, గురుస్వామి నవ యుగ మూర్తి, అయ్యప్ప ఆలయ కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి, కవి బి. వెంకట్, నవ్య వినయ్ తదితరు లు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' చొరవ అభినందనీయం

- గొల్లపల్లి మాధవి, న్యాయనిర్ణేత

సాంస్కృతి, సాంప్రదాయాలను కాపాడడంలో భాగంగా 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' తీసుకున్న చొరవ అభినందనీయమని ముత్యాల ముగ్గుల పోటీ న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన గొల్లపల్లి మాధవి అన్నారు. సంక్రాంతి పండుగ, సంక్రాంతి ముగ్గుల విశిష్టతను అందించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీని నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి వారు అభినందనలు తెలిపారు. రైతులు తాము పండించిన పంటలో ప్రకృతిలోని జీవరాశికి కొంత అర్పించే పండుగ సంక్రాంతి అని వివరించారు. భవిష్యత్తు లోనూ పాడి పంటలతో విలసిల్లాలని రైతులు కోరుకుంటూ సంక్రాంతిని జరుపుకుంటారన్నారు. అదే విధంగా జిల్లాలోని అన్ని వర్గాల వారు సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరూ అద్భుతమైన మంచి సందేశాత్మకమైన ముగ్గులు వేశారని కొనియాడారు.

మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉంది

- పాలెపు అశ్విని, తాండ్ర, సారంగాపూర్



నేను తొలిసారి 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొన్నా. మొదటిసారే ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది. నేను మరిచిపోలేని అనుభూతినిస్తోంది. సామాజిక బాధ్యతగా ముత్యాల ముగ్గులో సైతం మంచి సందేశాన్ని ఇచ్చానన్న సంతోషం ఉంది.

ముగ్గులు వేయడం నా హాబీ

- ఏ. ప్రశాంతి, పొట్టపెల్లి, లక్ష్మణచాంద మండలం



చిన్ననాటి నుంచి వేయడం నా హాబీ. సామాజిక అంశాలతో కూడిన ముగ్గులు వేయడం అంటే నాకు ఎంతో ఇష్టం. సమాజంలో ఆడపిల్లల పట్ల చూపుతున్న వివక్షను నన్ను కలచివేస్తోంది. ఈ రోజుల్లో ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుంటున్నారు. అదే అంశంపై నేను వేసిన ముగ్గు ద్వితీయ బహుమతి గెలుచుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

ముగ్గుల పోటీలో పాల్గొనడం సంతోషంగా ఉంది..

- నవ్య వినయ్, నిర్మల్



నేను నిర్మల్‌లో పిల్లలకు కూచిపూడి నేర్పుతున్నా. ప్రాచీన కళలను బతికించాలన్న సంకల్పంతో నృత్యంతోపాటు పిల్లలకు వివిధరంగాల్లో శిక్షణనిస్తున్నా. 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గులపోటీ సమాచారంతో పిల్లలతో నృత్య ప్రదర్శనకు వచ్చి ముగ్గుల పోటీలో పాల్గొన్నా. పోటీలో పాల్గొనడం సంతోషంగా ఉంది. తృతీయ బహుమతి రావడంతో మరింత సంతోష పడుతున్నా.

హెచ్‌ఎంపై దాడికి యత్నించడాన్ని ఖండిస్తున్నాం

- జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు

నిర్మల్‌రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జడ్పీహెచ్‌ఎస్ మదీనా కాలనీ భైంసా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిపై దాడిని ఖండిస్తున్నట్లు జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు మహేందర్ తెలిపారు. గౌరవ ప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ తన మాట వినలేదని, సర్వీస్ సర్టిఫికెట్‌పై సంతకం చేయలేదని గెజిటెడ్ హెచ్‌ఎంపై దాడికి యత్నించడం హేయమైన చర్యని అన్నారు. దీన్ని నేరంగా పరిగణించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సదానందం, కోశాధికారి సాయన్న పాల్గొన్నారు.

రాధా రాథోడ్‌కు సావిత్రిబాయి పూలే అవార్డు

లక్ష్మణచాంద, జనవరి5 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాధా రాథోడ్ సావిత్రిబాయి పూలే ఐకాన్ 2025ని అందుకున్నట్లు ఆదివారం తెలిపారు. విధినిర్వహణ, సామాజిక బాధ్యతలో మారుమూల ఆదివాసి, గిరిజన గ్రామాల్లో పర్యటించి అట్టడుగు వర్గాలకు విద్య, వైద్య, మహిళలను చదువుకునేలా ప్రోత్సహించినందుకు, చైతన్యవంతులుగా చేసి తాగునీరు, రోడ్డు రవాణా సౌకర్యాలను సమకూర్చి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాలకు చేరే విధంగా కృషి చేసినందుకు ఈ అవార్డు లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవార్డును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డును అందుకున్న ఆమెను పలువురు అభినందించారు.

యువకుడిపై హత్యాయత్నం.. నిందితుల అరెస్టు

సారంగాపూర్, జనవరి5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన షేక్‌హర్షద్ (21)పై అదేగ్రామానికి చెందిన బొబ్బిలి సాయికుమార్‌తోపాటు మరో వ్యక్తి కలిసి కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేసిన వ్యక్తులను పట్టుకొని జైలుకు తరలించినట్లు సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్‌లు తెలిపారు. హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తితో పాటు మోటార్ సైకిల్‌ను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలి

నిర్మల్‌రూరల్, జనవరి5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న నిర్మల్ ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన వైద్య, ఆరోగ్య శిబిరాన్ని, ఆరోగ్య ప్రదర్శన శాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ సందర్శించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ ఉత్సవానికి వచ్చేప్రజలకు అవసరమైన ఆరోగ్యసేవలను అందించాలని, అన్నిమందులు ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లావిస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, డాక్టర్ వాసవి, సుధాకర్, భోజారెడ్డి, మతిన్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉద్యోగుల నిరసన

నిర్మల్‌రూరల్, జనవరి5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయం ముందు సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక దీక్ష ఆదివారం 27వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా ఉద్యోగులు ధూమ్ ధామ్ కళా జాతర, ఆటపాటలతో బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగులు కోరారు. కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్షా ఉద్యోగ సంఘసభ్యులు రాము, విఠల్, హర్షద్, స్పందన, ఫిరోజ్, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన నిర్మల్ ఉత్సవాలు

నిర్మల్ అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం నిర్మల్ ఉత్సవాల వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో వేడుకలు నేటి నుంచి 7వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్, అదనపు కలెక్టర్లు పరిశీలించారు. పాఠశాలల విద్యార్థులు, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, మహిళా స్వయం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలోని వస్తువులను పరిశీలించి అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... నిర్మల్ జిల్లా చరిత్రను, సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నిర్మల్ మహోత్సవాల కార్యక్రమానికి జిల్లా ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


కొయ్యబొమ్మలను పరిశీలిస్తున్న కలెక్టర్

స్థానిక సంస్థల ఎన్నికల కోసం
కాంగ్రెస్ సన్నాహక సమావేశాలు

- నేడు ఆదిలాబాద్‌లో సమావేశం
- హాజరుకానున్న పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్, పీసీసీ చీఫ్
- పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే ప్రధాన ఎజెండా

భైంసా, జనవరి5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల సంగ్రామానికి సన్నద్ధమవుతున్నాయి. వ్యూహ, ప్రతివ్యూహాలతో పార్టీ శ్రేణులను ఎన్నిల భేరికి సమాయత్తం చేసేందుకు ప్రణాళికాబద్ధ విధానాలకు శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగానే అధికార కాంగ్రెస్ అధిష్ఠానం స్థానికసంస్థల ఎన్నికల కోసం తమ పార్టీ శ్రేణులను కార్యోన్ముకులుగా చేసేందుకు రంగం చేసింది. ఉమ్మడి జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించింది. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచే ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసింది. సోమవారం ఆదిలాబాద్‌లో ఉమ్మడి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశ జరుగనుంది.

• హాజరుకానున్న ప్రధాన నేతలు

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించే పార్టీ సన్నాహక సమావేశానికి కాంగ్రెస్ ప్రధాన నేతలు హజరుకానున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, జిల్లాఇన్‌చార్జ్ మంత్రివర్యులు సీతక్కతోపాటు పలువురు ప్రధాన నేతలు హాజరుకానున్నారు.

• పార్టీ శ్రేణుల సన్నద్ధమే ఎజెండా..

సన్నాహక సమావేశం ద్వారా పార్టీ శ్రేణులన్నింటిని స్థానిక సంస్థల ఎన్నికకోసం సన్నద్ధం చేసేందుకు గాను కాంగ్రెస్ అధిష్ఠానం రంగం సిద్ధం చేసింది. రేవంత్ రెడ్డి సారథ్యంలో ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంస్కరణలు, సాధించిన ప్రగతి, విజయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించి వాటిపై క్షేత్రస్థాయిలో విస్తృతస్థాయి ప్రచారంతో చైతన్యపరచనున్నారు.

రైతులకు రోడ్డు వేసి ఇచ్చిన సొసైటీ డైరెక్టర్



వాగువద్ద వేస్తున్న రోడ్డు

బోథ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోథ్ బి.మేడి శివారులో రైతులు తమ పొలాల్లో వెళ్లేందుకు ప్రతిరోజు అవస్థలు తప్పడం లేదు. అయితే రైతులు పడుతున్న బాధలను సొసైటీ డైరెక్టర్ చెట్ల ఉమేష్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన డైరెక్టర్ ఆదివారం తన సొంత నిధులతో రైతులు వెళ్లే గారికి రోడ్డు వేసి ఇచ్చారు. బురదమయంగా ఉన్న రోడ్డు వాగువద్ద సిమెంట్ పైపులు వేసి రాకపోకలు కొనసాగే విధంగా రోడ్డు వేశారు. తమ సొంత నిధులతో రైతుల ప్రతినిధి సహకార సంఘం డైరెక్టర్ రోడ్డు పూర్తిచేయడంతో మేడి శివారం రైతులు రాళ్ల శంకర్, కుమ్మరి రాజు, పి. నరసయ్య, చీర కిషన్, లక్ష్మీనారాయణ, చాంద్ పాషా, భగవాన్ రెడ్డి, చంద్రమోహన్, కుమ్మరి పోతారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. అడగగానే రోడ్డు వేసి ఇచ్చిన డైరెక్టర్ను అభినందించారు.

సెంటర్ల బలోపేతం కోసం కృషి చేస్తా

బోథ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాయి సెంటర్ల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని రాయి సెంటర్లు మరింత బలోపేతం కావాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న పేర్కొన్నారు. ఆదివారం పార్డీ (బీ) గ్రామంలో జరిగిన రాయిసెంటర్ సమావేశానికి వెళ్లి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి సమాజంలో రాయి సెంటర్ల పాత్ర అభినందనీ యమన్నారు. ఆదివాసీలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు రాయి సెంటర్లు ఎంతగానో ఉపకరిస్తున్నాయన్నారు. 18 గ్రామాల రాయిసెంటర్ల వారు సమావేశంలో పాల్గొన్నారు. సమస్యలను ప్రభుత్వదృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో తులసి లక్ష్మణ్, లాలు, రామ్ గీతాకార్, ఆత్రం గంగాధర్, సలహాదారుడు మడాది భీమ్‌రావు, ఆదివాసీ నాయకులు మిశ్రం భూమన్న, చైతు పటేల్, దేవారి స్వామి, తుడుం దెబ్బ నాయకులు, మారుతి పాల్గొన్నారు.

శ్రీకాంత్‌రెడ్డికే డీసీసీ పదవి ఇవ్వాలి : అజహార్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి5 (ఆంధ్రజ్యోతి) : మూడుతరాలుగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ కుటుంబం కాంగ్రెస్‌కు సేవలు అందిస్తుందని డీసీసీ అధ్యక్ష పదవికి ఆయన అర్హుడని ఖుర్షిద్‌నగర్‌కు చెందిన కార్యకర్త అజార్‌ఖాన్‌పటేల్ అన్నారు. శ్రీకాంత్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చేంత వరకు తను పాదరక్షలు వేసుకోనని చెప్పులను వదిలాడు. ఆదివారం ఎన్టీఆర్‌చౌక్‌లో కాంగ్రెస్ నాయకులు ఆయన పాదరక్షలను తీసి సంకల్పానికి శ్రీకారం చుట్టారు. మూడుతరాల నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న కుటుంబం నుంచి శ్రీకాంత్‌రెడ్డి వచ్చారని ఖుర్షిద్‌నగర్‌కు చెందిన కార్యకర్త అజార్‌ఖాన్‌పటేల్ అన్నారు. నిబద్ధత గల నాయకుడిలా ఆయన ఎంతో సేవలు అందిస్తున్నారన్నారు. డీసీసీ అధ్యక్ష పదవికి ఆయన సరైన వ్యక్తి అని తెలిపారు. పార్టీ అధిష్ఠానంతో పాటు పెద్దలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. శ్రీకాంత్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి వచ్చేంత వరకు తను పాదరక్షలను వేసుకోబోనని ప్రతినభూనాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముబారక్, ఇర్ఫాన్, సలీం, ఖయ్యుం, ఫయాజ అహ్మద్‌షామ, అయ్యుబ్, నహీద్, సమీరుల్లాఖాన్, భగత్‌సంగీత, జుబేద బేగం, ఖమర్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

● రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఏటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు అన్నారు. ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నభోజన కార్మికసంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, ఇచ్చిన హామీలు, పెండింగ్ బిల్లులు, వేతనాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కుంటాల రాములు మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నభోజన కార్మికులకు పదివేల రూపాయలను ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్న కార్మికుల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగమణి, గంగామణి, అనసూయ, పుష్ప, సౌందరయ్య, సుశీల, శశికళ, సత్యమ్మ, అనిత, లక్ష్మి, రేఖ తదితరులున్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన జాదవ్ బలిరామ్

బోథ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ ఆకులరాజేందర్ తల్లి శనివారం మృతి చెందడంతో ఆయనను అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలిరాం ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఉత్సవాల్లో రబీంద్ర విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్‌కు చేర్యాల పెయింటింగ్‌ను అందజేస్తున్న రబీంద్ర విద్యార్థులు

ముథోల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు చేర్యాల పెయింటింగ్ తో పాటు ఇస్రో చంద్రయాన్ మోడల్ ఎగ్జిబిషన్ ఉంచడంతో సందర్శకులతో పాటు జిల్లా కలెక్టర్, డీఈవోలతో మన్ననలు పొందినట్లు ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ తెలిపారు.

నిర్మల్ ఉత్సవాల్లో రాజురా జడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థులు

లోకేశ్వరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): లోకేశ్వరం మండలంలోని రాజుర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు నిర్మల్‌లో జరుగుతున్నటువంటి ఉత్స వాల్లో పాల్గొని ఈ ఉత్సవాల్లో భాగంగా వేడి వేడి నూనెలో నుంచి చేతితో బజ్జీలు తీయడం స్టాళ్లను ఏర్పాటు చేశారు. రాజుర పాఠశాలకు సంబంధించిన విద్యార్థు లు వేడి వేడి నూనెలో నుంచి చేతితో బజ్జీలు తీయడం అనేది అందరినీ ఆశ్చర్య పరిచింది. విద్యార్థులు వాటిని ఏవిధంగా చేస్తున్నారో చూస్తూ అలాగే ఉండి పోయారు. వీరిని పాఠశాల ప్రధానో పా ధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఎమ్మెల్యేని కలిసిన జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు

నిర్మల్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను నూతనంగా ఎన్నికైన జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ వీజీ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి. రమేష్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలి

● భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్



విజేతలుగా నిలిచిన భైంసా శిశు మందిర్ బాలికల జట్టు

భైంసా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ జీవిత లక్ష్యాన్ని నిర్ణయించుకొని సాధించేందుకు గాను పాఠశాల స్థాయి నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, ఆర్ఎస్ఎస్ జిల్లా సహా సంఘచాలక్ సాధుల కృష్ణదాస్‌లు సూచించారు. ఆదివారం భైంసాలోని పులేనగర్ సుభద్ర వాటిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల విభాగ్‌స్థాయి ఖేల్‌కూద్ పోటీ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లోని విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఇందులో శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యాపీఠం విభాగ్ అధ్యక్షులు డా.దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎల్.కిషన్, కోశాధికారి ధర్మపురి సుదర్శన్, జిల్లా కార్యకారిణి పురస్తు గోపాల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ జేకే సుదర్శన్ పాటిల్, ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యదర్శి సరుకొండ దామోదర్ పాల్గొన్నారు.

అటవీ అధికారులపై దాడి

● అధికారులపై తిరగబడిన గ్రామస్థులు
● రూ.3.50లక్షల విలువ చేసే కలప స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌ఓ

ఇచ్చోడ, జనవరి5 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలం కేశవ పట్నంలో భారీగా కలప నిలువ ఉందన్న సమాచారంతో ఆది వారం అటవీ సిబ్బందితో పాటు పోలీసులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ముందస్తుగా ఎఫ్ఎఎ రేవంత్ చంద్ర, ఎస్ఆర్ పుండలిక్, టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌లతో పాటు ఇచ్చోడ, నేరడిగొండ ఎస్సైలు తిరుపతి, శ్రీకాంత్‌లు సిబ్బంది గ్రామంలో సోదాలు నిర్వహించారు. దాంతో ఒక్కసారిగా అక్కడికి వెళ్లిన సిబ్బందిపై స్థానికులు గుమిగూడగా పలువురు రాళ్ల రువ్వ డంతో ఐదుగురు సిబ్బందికి స్వల్పగాయాలయ్యాయి. రెండు అటవీ శాఖ వాహనాల అద్దాలు పగిలిపోయాయి. సేకరించిన కలపను ఎత్తుకెళ్లారు. వెంటనే సీఐ భీమేష్ పోలీసులను మోహరించి కలపను స్వాధీనం చేసుకున్నారు. దాదాపుగా రూ.3.50లక్షల విలువచేసే కలపను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

● ఎలాంటి దాడులు జరుగలేదు..

ఈ ఘటనపై డీఎస్వో ప్రశాంత్‌బాజీరావ్ పాటిల్ ఇచ్చోడ అటవీ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. స్మగ్లింగ్ జరుగుతుందన్న సమాచా రంతో జిల్లా ఎస్పీ ఆదేశాలతో అటవీ శాఖ అధికారులు, సిబ్బం దితో పాటు పోలీసుల సహకారంతో ఆది వారం నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో పలు కేసులు నమోదు కాగా అక్రమంగా కలప రవాణాలకు పాల్పడుతున్న వివరాలు సైతం ఉన్నాయి. ఈ ఘటనలో సిబ్బందిపై దాడి జరు గలేదు. అలాంటి దాడి జరిగితే ఇంత విజయవంతంగా తనిఖీలు నిర్వహించే వాళ్లం కాదన్నారు. త్వరలోనే గ్రామస్థుల తోడ్పాటుతో వారిని అరెస్టు చేస్తామన్నారు.

అంకిత భావంతో పని చేసినప్పుడే గుర్తింపు

● జిల్లా విద్యాధికారి ప్రణీత
● రామేశ్వర్ సేవలు మరువలేనివి



ఉపాధ్యాయుడు రామేశ్వర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తలమడుగు జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. మండలంలోని సుంకిడి శంకరి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు రామేశ్వర్ సేవలు మరువలేనివని డీఈవో ప్రణీత అన్నారు. గత 37 సంవత్సరాలుగా అంకితభావం తో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి ఉద్యోగ విరమణ పొందిన రామేశ్వర్ సుంకిడి పాఠశాలలో విద్యార్థుల కోసం అవసరమైన అనేక వస్తువులను తన సొంత నిధులతో ఇప్పించి పేద విద్యార్థుల సర్వాంగీన వికాసానికి తోడ్పాటు అందించిన రామేశ్వర్ ఎప్పటికీ విద్యార్థుల మదిలో నిలిచిపోతా రన్నారు. విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ స్వామి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర మరువలేనిది

● సామాజిక కార్యకర్త మౌనిష్‌రెడ్డి



మున్సిపల్ కార్మికులను సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న సామాజికకార్యకర్త మౌనిష్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్ జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను ప్రతినిత్యం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అభినందనీయమని సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జన్మదిన వేడుకలను పారిశుధ్య కార్మికుల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులను శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మౌనిష్ రెడ్డి మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలను పారిశుధ్య కార్మికుల నడుమ జరుపుకోవ డం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతీ వారి వారు అందిస్తున్న సేవలకు ఎన్ని సన్మానాలు చేసినా తక్కువేనని పే ర్కొన్నారు. కరోనా వంటి క్లిష్ట సమ యం లోను కార్మికులు విశేష సేవలం దించారన్నారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికి, అనంతరం ముడుపు మౌని ష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రిమ్స్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో వెంకటేష్, గోక సాగర్ రెడ్డి, క్యా తం సాయి కిరణ్ రెడ్డి, సామ సాయికృష్ణ రెడ్డి, ఎల్మ శ్రీకాంత్‌రెడ్డి, గంగం భీమ్‌రెడ్డి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మ న్ ముడుపు దామోదర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శంకర్, ఆర్పి జాదవ్ కృష్ణ, మెప్మా జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, టౌన్ కోఆర్డినేటర్ భాగ్య లక్ష్మి, సెక్షన్‌క్లర్క్ పాల్గొన్నారు.

తీరనున్న లోవోల్టేజి సమస్య.. రైతుల హర్షం



బోథ్ సబ్ స్టేషన్‌లో నూతనంగా నిర్మిస్తున్న హై పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న స్థానిక శాసన సభ్యులు

బోథ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతాంగానికి అవసరమైన నాణ్యమైన విద్యుత్ ను అందించాలన్న దృక్పథంతో విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. రబీ సీజన్లో రైతులు భూగర్భ జలాలను వినియోగించుకొని రబీ పంటలను సాగు చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ పెరిగింది. విద్యుత్ వినియోగం అధికంగా ఉండడం వల్లలో వోల్టేజీ సమస్య తలెత్తింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సమస్యను రైతులు విద్యుత్ శాఖ అధి కారుల దృష్టికి తీసుకురావడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి సైతం తీసుకు వచ్చారు.

● అధికారుల నిర్ణయంతో హర్షం..

రబీ సీజన్లో రైతులకు అవసరమైన విద్యుత్తు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ శాఖ అధికారులు నూతనంగా 5 ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. దీంతో లో వోల్టేజీ సమస్య తీరిపోతుందని రైతులు హర్షం వ్యక్తపరుస్తున్నారు. కొన్ని రోజులుగా రైతాంగం విద్యుత్ సమస్యతో సతమతమవుతున్నారు. ఇటీవల స్థానిక శాసన సభ్యుడు అనిల్ దృష్టికి విద్యుత్ సమస్యను రైతులు తీసుకురావడంతో ఎమ్మెల్యే సైతం సమస్య పరిష్కారం దిశగా అధికారులతో మాట్లాడారు.

● రాత్రింబవళ్లు కష్టపడుతున్న రైతులు

మండలంలో నల్లని సారవంతమైన భూము లు ఉన్నా..సాగు కోసం భూగర్భ జలాలు ఉన్నా వినియోగించేందుకు రాత్రింబగళ్లు రైతులు కష్ట పడుతున్నారు. సారవంతమైన భూముల్లో కష్ట పడే రైతులు ఉండడంతో నాలుగేళ్ల కాలంగా రబీ పంటల సాగు ఏటేటా పెరుగుతుంది. అ యితే అందుకు తగ్గటుగా విద్యుత్ సరఫరా లేక పోవడంతో రైతులు ఆందోళన చెం దుతున్నారు. సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చే పట్టడం వల్ల కొంత మేరకు సమస్య ను అధిగమించినట్లు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

● నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయండి: ఎమ్మెల్యే

నియోజకవర్గంలో భూగర్భ జ లాలను వినియోగించుకొని రైతు లు పంటలను సాగుచేస్తున్నారు. సాగు నీటి వసతి లేక రైతులు నియోజక వర్గ పరిధిలో భూగర్భ జలాలపై ఆధార పడి పంటలు పండిస్తున్నారని ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులకు వివరించారు. శనివారం ఆయన రైతుల కోరిక మేరకు బోథ్‌లోని సబ్ స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. అక్కడే ఉన్న విద్యుత్ శాఖ ఎస్ఈ చౌహాంతో విద్యుత్ సరఫరా విష యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దీంతో ఇక నుంచి లో వోల్టేజ్ స మస్య ఉండదని నియోజకవర్గ పరిధిలో రైతాం గానికి నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఈ ఎమ్మెల్యేకు హామీ ఇవ్వ డం జరిగింది.

రైతన్న సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

పెంబి / (ఖానాపూర్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రైతన్న సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ కెనాల్ ద్వారా దిగువన యాసంగి పంట సాగుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతును రాజు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చు తున్నామన్నారు. రైతు సంక్షేమాన్ని కోరే ఏకైక ప్రభుత్వం తమదని అన్నారు. సదర్మాట్ కెనాల్‌ను అభివృద్ధి పరిచి రైతుకు మేలు చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రైతులు ఎవరూ దిగులు చెందకుండా అధికారుల సూచనల మేరకు పంటలను పండించాలని సూచించారు. ప్రతి పంటకు నీరందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దయానంద్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

ఇంద్రవెల్లి, జనవరి 5 (ఆంధ్ర జ్యోతి): చదువులో రాణించి బంగారు భవిష్యత్తును ఏర్ప రుచుకోవాలని ఎంపీ గోడం నగేష్ విద్యార్థులకు సూచించారు. ఆది వారం మండల కేంద్రంలోని స్థానిక నాగోబా విద్యార్థి నిల యంలో వనవాసి కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ నాగోబా విద్యార్థి నిలయం వారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే ప్రణా ళికబద్ధంగా ముందుకు పోవాల న్నారు. నాగోబా విద్యార్థి నిలయం ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణతో నాణ్యమైన విద్య లభిస్తున్నట్లు సంతోషమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్, అఖిల భారతీయ ప్రశిక్షణ టోలీ సభ్యులు రామచంద్రయ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చెర్మన్ డోంగ్రే మారుతి పటేల్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగల గుండె చప్పుడు విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డబ్బులు, వెయ్యి గొంతుకలతో మాదిగల గుండె చప్పుడు వినిపిస్తామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో ముక్తా సాల్వే జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ జరగాలని న్యాయం కోసం ఉద్యమిస్తున్నాయన్నారు.

ఫటా..ఫట్...

అందుబాటులో పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు

● కుభీర్ వైద్యాధికారి డాక్టర్ పి.ప్రణయ్



కుభీర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పాము, కుక్కకాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్ అన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు ..

ప్రశ్న: ప్రభుత్వ ఆసుపత్రిలో పాము, కుక్కకాటు వ్యాక్సిన్లు ఉన్నాయా..?

జవాబు: పాము, కుక్కకాటుకు గురయిన వారికి వైద్య సేవలందించేందుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పాము కాటుకు యాంటిస్నేక్ సిరమ్, కుక్కకాటుకు యాంటి ర్యాబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: డెంగ్యూ భారిన పడకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి?

జవాబు: దోమలు వృద్ధి చెందకుండా పరిసర ప్రాంతాల్లో నివాసగృహాల్లో శుభ్రత పాటించాలి. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో పాత వస్తువుల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలి. వీటి ద్వారా దోమల నివారణ చర్యలు తీసుకోవాలి.

ప్రశ్న: డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి..?

జవాబు : డెంగ్యూ జ్వరం ఏడీస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి భారిన పడ్డ వారికి అధికంగా మోకాళ్లు, కీళ్ల నొప్పులతో కూడిన జ్వరంతో బాధపడతారు. జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్లి వస్తుంది.

ప్రశ్న: రోగాల భారిన పడకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి ?

జవాబు: ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. భోజనానికి ముందు చేతులు సబ్బుతో కడుక్కోవాలి. కాచి చల్లార్చిన నీటినే వాడాలి . వేడి వేడి పదార్థాలను భుజించాలి.

● (ఆంధ్రజ్యోతి, కుభీర్)

మాజీ ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

● మండల కాంగ్రెస్ నాయకులు

ముథోల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని మండల కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, పోతన్న యాదవ్, ఎజాజోద్దిన్‌లు సూచించారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ముథోల్ నియోజకవర్గకేంద్రాన్ని అభివృద్ధి చేయలేదని మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఒకే పార్టీలో ఉంటూ విమర్శించుకోవడంతో కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకుముందు ఉన్న బీటీ రోడ్డుపై సీసీ రోడ్డు 700ల మీటర్లు వేసేయగానే ముథోల్ అభివృద్ధి జరిగిపోయిందని వారు ప్రశ్నించారు. అలాగే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, కళాశాల నిర్మాణానికి రూ. 9 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు.

సొంతగూటికి చేరిన ఉద్యమకారుడు గ్యాతం నడిపి గంగయ్య

నేరడిగొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండలంలోని అడిగాంకె గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గ్యాతం నడిపి గంగయ్య బీజేపీలోంచి ఆదివారం సొంతగూటికి చేరారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీని వీడి తప్పుచేశానని పార్టీని వదిలాక పార్టీ విలువ తెలిసిందని రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేవలం బీఆర్ఎస్ పార్టీతోనే అని తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం కొట్లాడాల్సిన అవసరం మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, రాథోడ్‌సజన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ముండే పాండురంగ్, మాజీ ఉప సర్పంచ్ శిరీష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాడ్గెసుభాష్, గణేష్, సుభాష్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయండి

● బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్

నేరడిగొండ, జనవరి5 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ స్థాయిలో జరిగే సమీక్ష సమావేశం ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపాదాస్‌మున్షి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. అలాగే ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, టీపీసీసీ సెక్రటరీ సత్తుమల్లేష్, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజు పటేల్, ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో గల అన్ని నియోజక వర్గాల ఇన్‌చార్జీలు పాల్గొననున్నారు. నియోజక వర్గంలో ఉన్న మండల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సేవదళ్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఫిషరీస్, వికలాంగుల, మహిళ, కిసాన్ కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, బూత్ లెవల్ అధ్యక్షులు అందరు పాల్గొని ఆదిలాబాద్ పార్లమెంట్ సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన కడ్తాల్ గ్రామస్తులు

సోన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ గ్రామంలో సర్వీస్ రోడ్డు విషయమై డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావును కడ్తాల్ గ్రామస్తులు కలుసుకున్నారు. 44 జాతీయ రహదారి వెడల్పులో గ్రామంలో పై ఓవర్ నిర్మించారని దీంతో సర్వీస్ రోడ్డు లేకుండా రహదారిని ఏర్పాటు చేశామని వాపోయారు. గతంలో ఉన్న సర్వీస్ రోడ్డును రహదారిలో కలపడం వలన గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సర్వీస్ రోడ్డు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిల దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.



పోటీలో పాల్గొని ముగ్గులు వేస్తున్న యువతులు





ముగ్గులు వేస్తున్న యువతులు

'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' వారి ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో అట్టహాసంగా జరిగాయి. ముత్యాల ముగ్గు పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీల్లో పాల్గొనేందుకు యువతులు, మహిళలు భారీగా తరలివచ్చారు. ముత్యాల ముగ్గులేసి.. అందులో రంగులు అద్దారు. పాల్గొన్న యువతులు, మహిళలకు బహుమతులను అందజేశారు.





నిర్మల్‌లో ఆకట్టుకున్న 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్'

ముత్యాల ముగ్గుల పోటీ



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు







ముగ్గుల పోటీ సందర్భంగా నృత్యం చేస్తున్న యువతులు



ఐదో రోజుకు చేరిన సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె



భైంసా సమ్మె శిబిరంలో సివిల్ సప్లయ్ హమాలీలు

భైంసా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, డిమాండ్ల నెరవేర్చుకునేందుకు గాను సివిల్ సప్లై హమాలీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భైంసాలోని మండల లెవల్ స్టాకిస్ట్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసుకున్న సమ్మె శిబిరంలో హమాలీలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హమాలీ యూనియన్ భైంసా డివిజన్ ప్రతినిధులు మాట్లాడుతూ అపరిష్కృతంగానున్న తమ సమస్యలను కాలయాపనకు తావులేకుండా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం చేసుకున్న ఒప్పందాలన్నింటిని అమలు పరచాలన్నారు. ఇదే ప్రకారం హమాలీ రేట్లను పెంచాలన్నారు. సమస్యలు పరిష్కమయ్యేంత వరకు, డిమాండ్లు నెరవేరేంత వరకు సమ్మె నిరవధికంగా కొనసాగుతుందని వెల్లడించారు.

ఘనంగా వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం

కుంటాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓలా గ్రామంలో ఆదివారం వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్స వాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయం వద్దకు మహిళలు మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్లి హనుమాన్ ఆంజనేయ స్వామికి అభిషేకం, అర్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

గజ్జెలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కుంటాల, జనవరి, 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జెలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంటాల గ్రామస్థులే కాకుండా ప్రతీ ఆదివారం పక్క గ్రామాలతో పాటు పక్క మండలాల నుంచి సైతం గజ్జలమ్మ ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించి గజ్జెలమ్మకు ప్రీతి పాత్రమైన నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఆదివారం ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



గజ్జెలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సంఘాల బలోపేతానికి బాధ్యులు అంకితభావంతో పాటుపడాలి

● మున్నూరుకాపు మిత్ర మండలి భైంసా డివిజన్ అధ్యక్షుడు గాలి రవి

భైంసా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంఘాల బలోపేతానికి, సంఘ సభ్యుల సంక్షేమానికి సంబంధిత సంఘాల కార్యవర్గ బాధ్యులు అంకితభావంతో పాటు పడాలని మున్నురుకాపు మిత్ర మండలి భైంసా డివిజన్ అధ్యక్షులు గాలి రవి పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలో మిత్ర మండలి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన స్థానిక వెండి, బంగారు వర్తక సంఘం కార్యవర్గానికి నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాధ్యుల పనితీరుపైనే సంఘాల భవిష్యత్తు, మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. సంఘ సభ్యులందరిని ఎకతాటి పైకి తీసుకవచ్చి వారి కష్టసుఖాల్లో బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలన్నారు. మార్గదర్శకమైన నాయకత్వపు పనితీరుతో సంఘాలను ఆదర్శంగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత సంఘ పెద్దలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వెండి,బంగారు వర్తక సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు మైస గోపాల్, కోర్వ శ్రీకాంత్‌లను మున్నురుకాపు మిత్ర మండలి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించింది. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి పెదకాపు గజ్జారామ్, కోశాధికారి, కార్గాము వినోద్ కుమార్, కార్యవర్గ సభ్యులు మహేష్, విద్యాధర్, కాండ్లీ సాయినాథ్,స్వామి, గంగాభూషణ్, సుదర్శన్, పబ్బు సురేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



వెండి,వర్తక సంఘం ప్రతినిధులను సన్మానించిన మున్నూరుకాపు మిత్ర మండలి సభ్యులు

కరాటే విద్యార్థులకు కలర్ బెల్టుల ప్రదానం



బెల్ట్‌లు సాధించిన కరాటే విద్యార్థులు

భైంసా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నబాహు సాఠే భవనంలో ఆదివారం కరాటే విద్యార్థులకు కలర్ బెల్టుల గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ నిర్మల్ ఆధ్వర్యంలో జరిగిన గ్రేడింగ్ పరీక్షల్లో భైంసా, బాసర, నర్సాపూర్(జి), కుభీర్, తానూర్, లోకేశ్వరం మండలాలకు చెందిన 76 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ కరాటే రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎక్సమినర్ సెన్సాయ్ తేజేందర్ భాటియా, నిర్మల్ జిల్లా అధ్యక్షులు కొండాజీ శ్రీకాంత్, కార్యదర్శి అమ్ముల భూషణ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహిళా శిక్షకురాలు ఏడిపెల్లి మృణాళిని సారధ్యంలో కలర్ బెల్టుల గ్రేడింగ్ పరీక్షలు జరిగాయి. పరీక్షల్లో ప్రావీణ్యతను ప్రదర్శించిన వారిలో 57 మంది విద్యార్థులు జూనియర్ రెడ్ బెల్టులు, 12 మందికి ఎల్లో బెల్టులు, ఇద్దరికి అరెంజ్ బెల్టులు, ఒకరు గ్రీన్ బెల్టును సాధించారు. గ్రేడింగ్ పరీక్షల్లో భైంసా మార్షల్ అర్ట్స్ శిక్షకులు శ్రీరాముల సాయికృష్ణ, శివరాజ్ గౌడ్, అజయ్ నాయక్, రాజశ్రీ, ప్రతీక్ష, అనూష, అనన్య, జ్ఞానతేజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ కరాటే రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎక్సామినర్ సెన్సాయ్ తేజేందర్ భాటియా మాట్లాడుతూ తల్లితండ్రులు తమ పిల్లల రక్షణకు కరాటే నేర్పించాలని సూచించారు.



శోభాయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీరామ పల్లకీ శోభాయాత్ర

● పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణం లోని డైట్ మైదానంలో నిర్వహిస్తున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీరామ పల్లకీ శోభా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా దేవుని నామస్మరణతో ఆధ్యాత్మికత చోటుచేసుకుంది. శోభాయాత్రలో భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'చలి'ంచని అధికారులు

● బాసర ట్రిపుల్ ఐటీ హాస్టళ్లలో అద్దాలు లేని కిటికీలు, చన్నీటి స్నానాలు ● 9 వేల మంది విద్యార్థుల అవస్థలు




బాయ్స్ హాస్టల్‌లో పగిలిపోయిన కిటికీ అద్దాలు

బాసర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చలి పంజాకు ఇళ్లలో అన్ని సక్ర మంగా ఉన్నావాళ్లే వణికి పోతున్నారు. ఉదయం 9 అయినా బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇలాంటి కనిష్ట ఉష్ణోగ్రతల్లో అద్దాలు పగిలిన కిటికీల గదుల్లో, చన్నీటి స్నానాలు చేస్తూ బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు నిత్యం విలవిలలాడుతున్నారు. మూడేళ్ల నుంచి విద్యార్థులు విన్నవిస్తున్న సోలార్ హీటర్లు పెట్టిస్తున్నామంటూ పట్టించు కోవడం లేదు. క్యాంపస్‌లో 9 వేల మంది విద్యార్థులు చదువుకుంటుండగా వారికి హాస్టల్‌లో వెయ్యి గదులున్నాయి. ఇందులో సగం వరకు గదుల కిటికీలు పగిలిపోయాయి. మరికొన్ని కిటికీల తలుపులు ఊడిపోయాయి. దీంతో ఎముకలు కొరికే చలిలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరికి ఆస్తమా, అలర్జీలతో అనారోగ్యానికి గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తెల్లారిన తర్వాత స్నానాలకు వెళితే వేడి నీళ్లు రావు. చన్నీటి స్నానాలు చేస్తున్న కొంత మంది చలి బాధకు స్నానపు జోలికి పోవడం లేదని తెలుస్తోంది. మరికొంత మంది విద్యార్థులు తప్పని పరిస్థితుల కారణంగా ఇంటి నుండి రహస్యంగా తెచ్చుకున్న ఎలక్ట్రిక్ హీటర్లతో వేడి నీటిని వినియోగించుకుంటున్నారు. గత రెండేళ్ల నుంచి విద్యార్థులు పలుమార్లు హాస్టళ్లలో మౌలిక వసతుల సమస్యలపై విన్నవిస్తూనే ఉన్నారు. కాని అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బాయ్స్ హాస్టల్ గదులకు కిటికీలు ఊడిపోయిన దృశ్యం

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 7.7



నేడు జిల్లాకు దీపాదాస్ మున్షి రాక

మావల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి ముఖ్యనాయకుల, కార్యకర్తల సమావేశానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి దీపాదాస్మున్షి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్‌లు జిల్లాకు రానున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మావల సమీపంలోని పద్మనాయక గార్డెన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు భారీసంఖ్యలో హాజరు కావాలని కోరారు.



పంచాయతీ ఎన్నికలు.. ఫిబ్రవరిలో జరిగేనా?

- ఎన్నికలు లేక ఎన్ని అవస్థలో..
- ప్రత్యేక పాలనలో ఆర్థిక ఇబ్బందులు

ఉట్నూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పల్లెలు అభివృద్ధి చెందితే పట్టణాలు అభివృద్ధి చెందినట్లుగా ప్రకటిస్తున్న పాలకులు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుపకపోవడంతో గ్రామాలు అవస్థల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామాలకు ప్రథమ పౌరులు కరువై పోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక పంచాయతీలు నీరసించిపోతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో సైతం చివరి ఏడాదిలో సరిగా పంచాయతీలకు నిధులు రాకపోవడంతో సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారు. అప్పులు చేసి పనులు చేసిన గ్రామాల ప్రథమ పౌరులు ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి ఆరు నెలలు దాటినా ప్రభుత్వం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు

గ్రామ సర్పంచ్‌ల పదవి కాలం ముగియగానే మండలాల్లో పని చేస్తున్న ఉద్యోగులు అధికారులను గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఆయా పంచాయతీల గ్రామ కార్యదర్శితో కలిసి గ్రామంలో సర్పంచ్‌ల పాత్ర పోషిస్తున్న ప్రత్యేక అధికారులు ప్రారంభంలో గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నా అవి పరిష్కరించడానికి నిధులు లేక పోవడంతో అవాక్కయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు సైతం ప్రభుత్వం సకాలంలో వేతనాలు విడుదల చేయక పోవడంతో పారిశుధ్య కార్మికులు ఎప్పుడు పనులు నిలిపి వేసి సమ్మెబాట పడతారో అని ప్రత్యేక అధికారులు కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. కొందరు కార్యదర్శులు కరెంట్ బల్బులు, బ్లీచింగ్ పౌడర్ తదితర వస్తువులను అరువుపై తెచ్చి కాలం నెట్టుకొస్తుండడంతో ప్రతీ చిన్న గ్రామ పంచాయతీ రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు, పెద్ద పంచాయతీ ఐదు నుంచి రూ.పది లక్షల వరకు అప్పుల్లో కూరుకపోయినట్లు తెలుస్తోంది. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను కేటాయించడంతో దీని పై డ్రైవర్‌తో పాటు పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారు. ప్రతిరోజూ ట్రాక్టర్ నడపడానికి డీజిల్ డబ్బులు అవసరం అవుతున్నాయి. ఇవేమి కూడా ప్రత్యేక అధికారులు పట్టనట్లు ఉండడంతో కార్యదర్శులు కూడా అప్పుల్లో కూరుకుపోతున్నారు.

ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగేనా?

ప్రజాపాలన కొనసాగిస్తున్న ప్రభుత్వం బీసీల జనాభా తేల్చడానికి పూనుకుంది. ఇప్పటికే కులగణన కార్యక్రమాలు పూర్తి చేసింది. దీంతో ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగేవీలు ఉంటుందని అధికారులు చేపడుతున్నా హడావిడి కార్యక్రమాల వల్ల అర్థమవుతోంది. పంచాయతీ ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల చేసి బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేస్తుండడం, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సౌకర్యాలు పరిశీలించడం, నోడల్ అధికారులను నియమించడం చూస్తుంటే ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీల ఎన్నికలు జరిపే అవకాశాలు ఉన్నట్లు గోచరిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1519 గ్రామ పంచాయతీలు కాగా, 12,844 వార్డులు ఉన్నాయి. 16.16 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం 17,310 బ్యాలెట్ బాక్సులు, 12,850 పోలింగ్ కేంద్రాలు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల కోసం 30 గుర్తులు, వార్డు సభ్యుల ఎన్నికల కోసం 20 గుర్తులను కేటాయించాలని అధికారులు భావిస్తున్నారు. సర్పంచ్ బ్యాలెట్ గులాబి రంగులో, వార్డు సభ్యుల బ్యాలెట్ తెలుపు రంగు కాగితంలో ముద్రించే పనులకు అధికారులు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

ఉట్నూర్ మేజర్ పంచాయతీకి దశాబ్దం తర్వాత ఎన్నికలు

ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీకి పదేళ్ల తర్వాత ఎన్నికలు జరుగనున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 26,337 ఉట్నూర్ జనాభా ఉంది. 12,534 మంది ఓటర్లు ఉన్నారు. 18 వార్డులు ఉన్నాయి. మేజర్ గ్రామ పంచాయతీకి చివరి సారిగా 2014లో ఎన్నికలు జరిగాయి. 2019లో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగగా ఉట్నూర్ గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగలేదు. 15వేల జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేయాలని భావించింది. దీంతో ఎన్నికలు జరగలేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ ప్రాంత ప్రజలు తిరస్కరించడంతో ప్రభుత్వం 2022లో గ్రామ పంచాయతీగానే కొనసాగిస్తామని నిర్ణయించింది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ సారి గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఓటర్ల జాబితాను సైతం తయారు చేశారు. గ్రామ పంచాయతీలో ఎన్నికలు ఎప్పుడెప్పుడు జరుగుతాయా అని ఆశావహులైన అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు.

సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలి

- పంద్ర జైవంత్‌రావు, మాజీ ఎంపీపీ, ఉట్నూర్



గ్రామ పంచాయతీల ఎన్నికలు ప్రభుత్వం వెంటనే నిర్వహించాలి. గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిధులు లేక పోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలు నెరవేరడం లేదు. గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిధులు కనిపించడం లేదు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- ఆత్రం రాహుల్, మాజీ సర్పంచ్, గోండు కొత్తగూడ



గ్రామాల స్థాయిలో సర్పంచ్‌లు సమస్యలు పరిష్కరించడానికి అప్పులు చేసి డబ్బులు పెట్టారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు ఇవ్వకపోవడం వల్ల సర్పంచ్‌లందరు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ప్రజా ప్రభుత్వం మాజీ సర్పంచ్‌లను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

చిన్న వాహనాలను విడిచి పెట్టాలి

- ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్

ఉట్నూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా రాత్రి 9 గంటల తర్వాత కవ్వాల్ అభయారణ్యం గుండా చిన్న వాహనాలు వెళ్లకూడదని అటవీ అధికారులు కొత్త నిబంధనలు తీసుకురావడంతో శనివారం రాత్రి ఉట్నూ ర్ మండలం కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద భారీగా కార్లు, ఇతర చిన్న వాహనాలను చెక్‌పోస్టు సిబ్బంది నిలిపివేశారు. దీంతో ఎముకలు కొరికే చలిలో కార్లలో ప్రయా ణిస్తున్న స్త్రీలు, వృద్ధులు పడరాని పాట్లు పడ్డారు. చెక్‌పోస్టు వద్ద భారీగా చిన్న వాహ నాలు నిలిచి పోయాయని తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మె ల్యే వెడ్మబొజ్జుపటేల్ హుటాహుటిన స్వయంగా కారు నడుపుకుంటు అర్ధరాత్రి 12 గంటలకు కొత్తడూడ చెక్‌పోస్టుకు చేరుకున్నారు. అక్కడ ప్రయాణికులతో మాట్లాడారు. చలిలో వారు పడుతున్న బాధలు చూసి చలించి పోయారు. చెక్‌పోస్టు సిబ్బందిని నిలదీశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము వాహనాలు నిలిపివేశామని చెప్పడంతో ఎమ్మెల్యే ఉన్నతాధికారి శాంతరాంతో ఫోన్‌లో మాట్లాడారు. కొత్త నిబంధనలు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేనే కాకుండా వైల్డ్‌లైఫ్ బోర్డు సభ్యుడని కూడా ఉన్న విషయం గుర్తుచేశారు. తనకు తెలియకుండా కొత్త నిబంధనలు ఎలా అమలు పరు స్తారని నిలదీశారు. వెంటనే వాహనాలు విడిచిపెట్టాలని కోరారు. ఆదిలాబాద్ డీఎఫ్ఓతో కూడా ఫోన్లో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందికి గురిచేసే చర్యలు మానుకోవాలని సూచించారు. చిన్న వాహనాల అనుమతి విషయంలో తాను అటవీ శాఖ మంత్రితో, ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేట ర్‌తో ఉదయమే మాట్లాడుతానని, ఈ అంశం ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఉన్నత స్థాయి నిర్ణయం జరిగే వరకు చిన్న వాహనాలను ఆపకూడదని సూచించారు. అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తీసుకురావడంతో అధికారుల ఆదేశం మేరకు బీర్సాయిపేట రేంజ్ అధికారి అరుణ, చెకొసిబ్బంది వాహనాలను విడిచి పెట్టారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అర్ధరాత్రి చలిలో తమకోసం వచ్చి తమకు సహాయం చేసిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌కు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

చేతులకు సంకెళ్లతో ఉద్యోగుల నిరసన



చేతులకు సంకెళ్లతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 05 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం నాటికి ఈ సమ్మె 27 రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట దారి పొడవునా ఉద్యోగులందరు తాడుతో చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని నినాదాలు చేశారు. సంకెళ్ల నుంచి తమను విముక్తి చేయాలని, ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, నాయకులు పార్థసారథి, వెంకటేష్, శ్రీకాంత్, కేశవ్, భోజన్న, రజిత, ప్రవీణ్, అతుల్, మిథున్ పాల్గొన్నారు.

వడూర్ గుట్ట అభివృద్ధికి కృషి చేయాలి



వనదర్శిని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

- బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడూర్ అటవీప్రాంతంలో అటవీ శాఖ అధికారులు నిర్వహించిన వన దర్శిని కార్యక్రమంలో బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు ముందు గా ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనం తరం హరితవనంలో మొక్కలు నాటారు. గ్రాస్‌ల్యాండ్‌లో పీటీ (నీటికుంట)ను కాలి నడకన అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. సఫారీలో తిరుగుతూ సోలార్ బోర్‌వెల్‌తో పాటు మొత్తం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. పార్డీ గ్రామానికి చెందిన చిరుతపులి దాడిలో గాయపడ్డ చందర్ మహారాజ్‌కి నష్టపరిహారంగా రూ.31 వేలను అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అటవీశాఖ వడూర్ గుట్టపైన ఉన్న అట వీ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్‌తో పాటు ట వర్ ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని అటవీ జంతువులు పాడుచేసిన పొలాలకు నష్టపరిహారం అందించాలని, అభివృద్ధి చేయడానికి పూర్తిగా కృషిచేస్తానని అన్నారు. తప్పకుండా అటవిని పర్యాటక కేంద్రంగా మారుస్తామని అన్నారు. కార్యక్రమంలో అటవీ అధికారులతో పాటు నాయకులు, రాథోడ్‌సజన్, పాండురంగ్, సురేందర్, ఎఫ్ఆర్ఓ గణేష్, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటలతో మానసికోల్లాసం

ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని బుగ్గారం (బీ) గ్రామంలో ఐదో బుగ్గారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారం భోత్సవానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజరై ప్రారం భించారు. ముందు గా క్రీడాకారు లను పరిచయం చేసుకుని టాస్ వేసి టోర్నీమెంట్‌ను ప్రారంభించారు. యువ కులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడా రు. అనంతరం మాట్లాడు తూ యువకులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనా లని, చెడు వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. యువకులకు ఎలాంటి సమస్యలున్నా ఒక అన్న లా మీతో ఉంటానని టోర్నీ మొదటి బహు మతిగా రూ.30వేలు అందిస్తానని తెలిపారు. కార్య క్రమంలో మండల నాయకులు రాథోడ్ సృజన్, పాండురంగ్, కృష్ణ, సురేందర్, రూప్‌సింగ్, శం కర్, కార్య కర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంబరానికి సిద్ధంగా ఉండాలి

బోథ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించేందుకు గాను కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాల్సి ఉంటుందని శాసన సభ్యులు అనిల్ పేర్కొన్నారు. శనివారం కార్యకర్తలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుదీర్ఘ చర్చలు జరిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఐకమత్యంగా కృషి చేయాల్సి ఉంటుందని ఏ గ్రామంలోనైనా గ్రూపులు కడితే సహించేది లేదని ఎమ్మెల్యే కార్యకర్తలకు సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపు నాలుగు గంటల పాటు గ్రామాల వారీగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల వారీగా చర్చించినట్లు కార్యకర్తలు పేర్కొంటున్నారు.

- క్యాంపు కార్యాలయంలో సుదీర్ఘ సమావేశాలు

శనివారం మధ్యాహ్నం 12 గంటలకు క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే గతంలో ఎన్నడు లేని విధంగా క్యాంపు కార్యాలయంలో నాలుగు గంటల పాటు చర్చలు కొనసాగించినట్లు తెలిసింది ముఖ్యంగా గ్రామాలలో పార్టీ పటిష్టత కోసం చేపట్టాల్సిన చర్యల గురించి గ్రామస్థాయి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని వివరించినట్లు తెలుస్తోంది. గ్రూపులు కట్టవద్దని గ్రూపు విభేదాలు ఉంటే సహించేది లేదని కార్యకర్తలకు వివరించినట్లు తెలిసింది. ఏ ఒక్కరు కూడా పార్టీకి వ్యతిరేకంగా పనిచేయవద్దని ఇప్పటినుంచే అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్న విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని పేర్కొన్నట్లు సమాచారం. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటు బ్యాంకు ఉన్న కొంత మంది బీఆర్ఎస్ నాయకులను అధికార పార్టీ నాయకులు తమ వైపు తిప్పుకునేందుకు ఎత్తులు వేస్తున్నారని అయితే అధికార పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ద్వితీయ శ్రేణి నాయకులకు కార్యకర్తలకు సూచించినట్లు తెలిసింది. రాబోవు రోజుల్లో భవిష్యత్తు మనకే ఉంటుందని ఎవరు కూడా అధికార పార్టీ వారికి ఉండకుండా ప్రజా సమస్యల పైన గ్రామస్థాయిలో ఉద్యమించాలని వివరించినట్లు సమాచారం గ్రామాలలో పార్టీ బలంగా ఉందని స్థానికపూర్లో విజయం మనదే అవుతుందని కార్యకర్తలకు సూచించినట్లు తెలిసింది.

ఆదిలాబాద్‌లో వణుకు పుట్టిస్తున్న చలి

ఆదిలాబాద్, జనవరి5 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో చలితీవ్రత పెరిగిపోవడంతో జనం వణికి పోతున్నారు. వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. ఆదివారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.5 కాగా కనిష్టంగా 6.7డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే భీంపూర్ మండలం అర్లి(టి)లో అత్యల్పంగా 5.9, బేలలో 6.3, మావలలో 7.1, ఉట్నూర్ 7.2, జైనథ్‌లో 7.7, ఆదిలాబాద్ అర్బన్‌లో 8.1, గుడిహత్నూర్‌లో 8.7,గాదిగూడలో 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 15 డిగ్రీల లోపే కనిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. ఉదయం రాత్రి వేలల్లో జనం చలిమంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు.అలాగే మారుమూల గిరిజన గ్రామాల పై దట్టమైన పొగమంచు కప్పేస్తుంది.జనవరి మాసంలోను కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో చలితీవ్రత మరింతగా పెరుగుతుంది. సంక్రాంతి పండుగ వరకు చలి ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులతో పగలంతా చలిప్రభావం కనిపిస్తుంది.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి : సీఐ



అవగాహన కల్పిస్తున్న సీఐ మొగిలి

ఇంద్రవెల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎవరైనా అతిక్రమించి ప్రయాణికులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ మొగిలి హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ఆటో డ్రైవర్లను పోలీస్ స్టేషన్‌కి పిలిచి ఎస్సై దుబ్బాక సునీల్‌తో కలిసి ఆటో డ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నడిపే ప్రతి ఒక్కరు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ ప్రమాద బీమా కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై ఆటోలు ఆపి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించవద్దాన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు : సీఐ రహీం పాషా

నార్నూర్, జనవరి 05 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించేలా ఆటోవాహనదారులు సహకరించాలని నార్నూర్ సీఐ పాషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆటోయూనియన్ కార్యాలయం దగ్గర ఆటో డ్రైవర్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ఫిరోజ్‌ఖాన్, డ్రైవర్లు, పాల్గొన్నారు.

నేడు ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ముఖడే ఉత్తం (ఫైల్)

ఇంద్రవెల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన పాలకవర్గం స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆ వ్యవసాయ మార్కెట్ కమిటి నూతన చైర్మన్ ముఖడే ఉత్తం ఆదివారం తెలిపారు. వైస్ చైర్మన్‌గా సోయం మారుతి (గాదిగూడ)తో పాటు డైరెక్టర్లుగా 15 మందిని పాలకవర్గం సభ్యులుగా నియమించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ప్రభుత్వం నియమించింది. జరగబోయే ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి కలసికట్టుగా పనిచేద్దాం

బోథ్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సమీపంలోని పెద్దల గుట్ట అంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కలిసికట్టుగా కృషిచేయాలని ఆలయ కమిటీ వారు నిర్ణయించారు. ఆదివారం ఆలయం వద్ద కమిటీసభ్యులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం నిర్మాణం చేపట్టాలని, అంతేగాక ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం తీసు కున్నారు. బలంగా నాని మరింత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు గాను మొరం పోయించాలని నిర్ణయించడం జరిగింది. భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి మోడల్ స్కూల్ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

బజార్‌హత్నూర్, జనవరి (ఆంధ్రజ్యోతి)5: నేటి నుంచి మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశాల కోసం ఆన్లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటుగా 7,8,9వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ దరఖాస్తులు 6-1-2025 నుంచి 28-2-2025 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివ రాలకు పాఠశాలను సందర్శించాలని తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.